# మిర్చి సాగుతో మస్తు లాభం

## పెంచికల్ పేట్ మండలంలో 210 ఎకరాల్లో పంట

- మార్కెట్‌లో మంచి డిమాండ్ ● ఎకరాకు రూ. లక్ష దాకా పెట్టుబడి.. ● రూ. 2 లక్షల ఆదాయం



గోంట్లపేటలో ఏపుగా పెరిగిన మిర్చి పంట

పెంచికల్‌పేట్, నవంబర్ 9 : రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల ఉచిత కరంట్‌తో పాటు రైతుబంధు ఇస్తూ ప్రోత్సహిస్తుండగా, రైతులు రంది లేకుండా వ్యవసాయం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ఎప్పుడూ ఒకేరకమైన పంటలు వేసి నష్టపోకుండా వాణిజ్య పంటలైన వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా పెంచికల్‌పేట్ మండలంలోని గొంట్లపేట, పెంచికల్‌పేట్, ఎల్కపల్లి గ్రామాల్లో దాదాపు 210 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు. మిర్చి సాగు ఆశాజనకంగా, లాభసాటిగా ఉండడంతో మిర్చి సాగుపై మక్కువ చూపుతున్నారు. కొంతమంది సొంత బోర్లతో.. మరి కొందరు పెద్దవాగు నీటిపై ఆధారపడి పంటలు వేస్తున్నారు.

**విత్తనాలు :** సన్నరకం, నంబర్-5 విత్తనాలు ఎక్కువగా వాడుతున్నారు. ఎకరాకు 8 విత్తన ప్యాకెట్ల(ఒక్కోటి 10 గ్రాములు)ను ఉపయోగిస్తున్నారు. యూరియా 53 కేజీలు,డీఏపీ 85 కేజీలు, మోనో ఫాటోస్ 34 కేజీలు మూడుసార్లు వాడాల్సి ఉంటుంది. ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. గతేడాది క్వింటాలుకు రూ. 22 వేల నుంచి రూ. 27 వేల వరకు ధర పలికిందని, ఈ యేడాది రూ. 20 వేల నుంచి రూ. 22 వేల దాకా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ లెక్కన రూ. 3 లక్షలకు పైగా ఆదాయం వచ్చే అవకాశమున్నది. రూ. లక్ష ఖర్చు తీసివేసినా.. మిగతా రూ. 2 లక్షలు మిగులుతాయని రైతులు పేర్కొంటున్నారు.



బొంబాయి గూడలో పంటను పరిశీలిస్తున్న రైతు

### పంట మంచిగనే ఉంది



మా దగ్గర వరి, పత్తి ఎక్కువగా సాగు చేసేటోళ్లం. కొన్నిసార్లు పెట్టిన పెట్టుబడి కూడా రాక నష్టపోయినం. గతేడాది మిర్చి సాగు చేసిన రైతులకు మంచి లాభాలచ్చినయి.అందుకే నేను కూడా ఈ యేడాది ఎకరంన్నరలో మిర్చి వేసిన. ఇప్పుడు పంట మంచిగనే ఉంది. ఎక్కువ దిగుబడి వస్తుందని ఆశిస్తున్న.

*- సత్తన్న, రైతు, బొంబాయిగూడ*

### ఐదెకరాల్లో మిర్చి వేసిన



నేను ఐదెకరాల్లో మిర్చి సాగు చేస్తున్న. ప్రస్తుతం కాయలు పడుతున్నయి. ఎకరాకు రూ. లక్ష దాకా ఖర్చు అయితే.. రూ. 2 లక్షల ఆదాయం మిగులుతుంది. పంటను ప్రాణమోలే చూసుకుంటున్న. ఎక్కువ దిగుబడి వస్తుందన్న ఆశ ఉంది.

*-దెబ్బటి మహేశ్, రైతు, గొంట్లపేట*

### సూచనలు పాటించాలి



ప్రభుత్వ సూచనల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపడం శుభపరిణామం. వరితోపాటు వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి సాగుపై రైతులు ఆశాజనకంగా ఉన్నారు. ప్రతి రైతు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి. అప్పుడే రైతుకు మరింత లాభం చేకూరుతుంది.

*-రాజుల నాయుడు ,ఏడీఏ పెంచికల్ పేట్.*



బెల్‌తరోడ బైంసా రోడ్‌కు ఇరువైపులా పెరిగిన చెట్లు

# హరితహారంతో ఆహ్లాదం

- గ్రామాల్లో పెరిగిన పచ్చదనం ● ప్రతి మొక్కనూ కాపాడుతున్న పంచాయతీలు

తానూర్, నవంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నది. గ్రామాల్లో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం, వాటిని కాపాడేందుకు పంచాయతీల పాలకవర్గాలు చర్యలు తీసుకోవడంతో గ్రామాలు ఆహ్లాదపూరిత వాతావరణంలో కనిపిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఖాళీ స్థలాలు, రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు పెరిగి వృక్షాలుగా మారాయి. దీంతో రహదారులు వెంట పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. హరితహారంలో భాగంగా ఏటా గ్రామ పంచాయతీ పరిధిలో 400 నుంచి 500 వరకు మొక్కలు నాటారు. మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు, ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టడం, చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ కొత్త మొక్కలు నాటి జాగ్రత్తగా కాపాడారు.

### ఆకట్టుకుంటున్న పచ్చదనం..

ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారితో పాటు పంచాయతీ పరిధిలో ఉన్న రహదారులకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. తానూర్ మండల పరిధిలోని బెల్‌తరోడ, బోంద్రట్, ఉమ్రి(కే) బోరిగాం, తానూర్, గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటారు. రహదారుల వెంబడి మొక్కలు పెద్ద పెద్ద వృక్షాలుగా మారడంతో వాహనదారులకు పచ్చదనంతో పాటు నీడను పంచుతున్నాయి.

### అందరి సహకారంతోనే..

" అందరి సహకారంతోనే మొక్కలు బతికాయి. అవి ఇప్పుడు చెట్లుగా మారి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. రహదారుల వెంట పచ్చని ప్రకృతి కనువిందు చేస్తోంది. దారి పొడువునా పచ్చదనం పరుచుకుంది. వివిధ గ్రామాల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సహకారం మరవలేనిది.

*-గోప సాయినాథ్, సర్పంచ్, బెల్‌తరోడ*

### పచ్చదనానికి కృషి

" పంచాయతీ పరిధిలో మరిన్ని మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతాం. పలు విడుతల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించాం, భవిష్యత్‌లో మరిన్ని మొక్కలు నాటి సంరక్షణకు పాటుపడతాం. ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ముందుకెళ్తాం.

*-శ్రీనివాస్‌రావు, మండల అభివృద్ధి అధికారి, తానూర్*

# విరబూసిన బంతి

- తానూర్ మండలంలో అత్యధికంగా సాగు
- ఖర్చు తక్కువ.. ఆదాయం అధికంగా ఉండడంతో మొగ్గు
- దీపావళి, కార్తీక పౌర్ణమి పండుగలకు భలే గిరాకీ

తానూర్, నవంబర్ 9 : బతుకమ్మ, దీపావళి, కార్తీక పౌర్ణమి పండుగల సందర్భంగా బంతి పూలకు భలే గిరాకీ ఉంటుంది. ఏ పూజ చేసినా బంతి పూలు ఉండాల్సిందే. మహారాష్ట్రలో అత్యధికంగా సాగవుతుండగా.. ఇక్కడి రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు. తానూర్ మండలంలోని సుమారు పది గ్రామాల రైతులు సాగు చేస్తున్నారు. కొందరు రైతులు పూలను తోటల వద్దే విక్రయిస్తుండగా.. మరికొందరు భైంసా, నిజామాబాద్, నిర్మల్‌తోపాటు మహారాష్ట్రలోని భోకర్, నాందేడ్ మార్కెట్లకు తీసుకెళ్లి అమ్ముతున్నారు. తోటల వద్ద తాజా పూలు లభిస్తుండడంతో వినియోగదారులు క్యూ కడుతున్నారు.

### తక్కువ ఖర్చు.. ఎక్కువ లాభాలు..

పత్తి, సోయా, ఇతర పప్పు దినుసుల సాగుకు పెట్టుబడి ఎక్కువ, లాభాలు కూడా తక్కువగా వస్తుంటాయి. ఎకరం భూమిలో బంతి పూలను సాగు చేయాలంటే రూ. 50వేల వరకు ఖర్చు అవుతోంది. ఒక్కో ఎకరానికి 3 టన్నుల వరకు దిగుబడి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఒక్కో కిలో రూ.100 ఉండగా.. రెండు టన్నులకు రూ.2 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. కేవలం 75 రోజుల పంట కావడంతో రైతులు ఈ దిశగా మొగ్గు చూపుతున్నారు. మూడేళ్ల క్రితం తానూర్ మండలంలో ఒకరిద్దరు రైతులు మాత్రమే సాగు చేయగా.. ఈ యేడు 10 మందికి పైగా రైతులు సాగు చేశారు.

### విరబూసిన బంతిపూలు..

మండల కేంద్రంలోని హిప్నెల్లి రోడ్డు, సింగన్‌గావ్, నంద్‌గావ్, వడ్‌గావ్ గ్రామాలలో రైతులు ఈ బంతి తోటలను సాగు చేశారు. యేడాదికి మూడు సార్లు పూలు పూస్తుండగా.. బతుకమ్మ, దీపావళి పండుగలకు ముందు పూసే పూలకు మంచి గిరాకీ ఉంటుంది. బతుకమ్మలకు బంతి పూలు ఎక్కువగా వాడుతుండటంతో మహిళలు పెద్ద మొత్తంలో ఈ పూలు కొనుగోలు చేస్తారు. ఈ



సమయంలో కిలో పూలకు రూ.100-రూ.150 వరకు ధర పలుకుతోంది. మిగిలిన సమయాల్లో ఈ పూలను ఫంక్షన్‌లు ఇతర కార్యక్రమాలకు ఉపయోగిస్తుంటారు. కాగా.. బంతి నారును మహారాష్ట్రలోని నాందేడ్ తదితర ప్రాంతాల నుంచి తెచ్చి ఈ తోటలు సాగు చేస్తున్నారు.

### ఎకరాకు మూడు టన్నులు

ఖరీఫ్ సీజన్‌లో ఏటా పత్తి, సోయా, ఇతర పంటలు వేసేవాన్ని. ఈ పంటలకు అత్యధికంగా ఖర్చు.. కష్టం ఉంటుంది. పక్కనే ఉన్న మహారాష్ట్రలో బంతి పూల సాగు చూసి.. లాభాలపై ఆరా తీశా. ఈ యేడు ఎకరం భూమిలో సాగు చేశా. రూ.50 వేల ఖర్చు చేయగా.. మూడు టన్నుల వరకు దిగుబడి వచ్చింది. దాదాపు రూ.2.50 లక్షల లాభం వచ్చింది.

*- బిసిమిల్లాఖాన్, బంతి పూల రైతు, తానూర్*

# వాడిపోతున్న 'పత్తి'

- వేసవిని తలపిస్తున్న ఎండలు ● వర్షాలు కురవక వట్టిపోతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు ● కలిసొస్తున్న చలి తీవ్రత

తానూర్, నవంబర్ 9 : వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పత్తి చేలు వర్షాలు లేక ప్రస్తుతం వాడిపోతున్నాయి. భూమిని నమ్ముకుని ఆరుగాలం కష్టపడుతున్నా.. వరుణుడు కరుణించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి పెట్టి ఈసారి ఢోకా లేదని, పంట చేతికొస్తుందని ఆశలు పెట్టుకున్న అన్నదాతల కళ్ల ముందే పంట వాడిపోతుంటే చేసేదిలేక దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. నీటి కొరత కారణంగా ఆరుతడిపైనే ఆధారపడి సాగు చేసుకుంటున్నారు. ఇందులో ప్రధానంగా పత్తి, కంది ఇతర పంటలపై దృష్టి పెట్టారు. తానూర్ మండలంలో 16 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పత్తి కాయ దశకు రావడంతో నీరు అందక చెట్లు వాడిపోతున్నాయని.. త్వరలో వర్షం కురిస్తే పంటకు అనుకూలమని అధికారులు చెబుతున్నారు. వర్షం వస్తే నీరు నిల్వ ఉండేందుకు వీలుగా కొంతమంది రైతులు నాగళ్లతో పత్తి సాళ్లు దున్నుతున్నారు. మరికొంత మంది రైతులు నీటి సౌకర్యం ఉండడంతో నీరు పట్టి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. పూర్తిగా నీటి సౌకర్యం లేని రైతులు దేవుడిపైనే భారం వేసి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.

బోరిగాం శివారులో వాడిపోయిన పత్తి పంట

